

'అడెల్లి'లో భక్తుల సందడి

అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం ఉమ్మడి జిల్లాతో పాటు నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸

7న హోలీ జరుపుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్/ఖానాపూర్: జిల్లాలో ఈ నెల 6న కామదహనం, 7న హోలీ జరుపుకోవాలని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గుణవంత్‌రావు జోషి సూచించారు. ఆదివారం హిందూవాహిని, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ బంధువులంతా పండుగను ధర్మం ప్రకారం శాస్త్రోక్తంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో గుడి రాజేశ్వరశర్మ సిద్ధాంతి, పురుషోత్తం శర్మ, నిమ్మగడ్డ సుధాకర్ శర్మ, ఓరుగంటి విజయ్ కుమార్, హిందువాహిని జిల్లా సహ సంయోజక్ కందుల హరీష్, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.6 /21.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోత పెరుగుతుంది.

ఆమె కోసం ఒకరోజు!

- ప్రతీ మంగళవారం మహిళా క్లినిక్
- ఎనిమిది రకాల రుగ్మతలకు పరీక్షలు
- అవసరమైన వారికి మందులు పంపిణీ
- జిల్లాలో రెండు యూపీహెచ్‌సీల ఎంపిక
- ఈ నెల 8 నుంచి ప్రారంభం
- భవిష్యత్‌లో మరిన్ని ఆస్పత్రుల్లో సేవలు

నిర్మల్‌చైన్‌గేట్: మహిళల ఆరోగ్య రక్షణకు తెలంగాణ సర్కారు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వారు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా వైద్యపరీక్షలు నిర్వహించి తగిన సేవలందించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళా క్లినిక్‌లను ప్రారంభిస్తోంది. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా 100 క్లినిక్‌లు ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని రెండు ఆస్పత్రుల్లో మహిళా క్లినిక్‌లను ప్రారంభించనున్నారు. ప్రతీ మంగళవారం ఈ క్లినిక్‌లలో మహిళలకు వైద్య సేవలందిస్తారు. భవిష్యత్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గురువారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మహిళా క్లినిక్‌లలో ఉండే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రేడియోగ్రాఫర్, స్టాఫ్‌నర్సులకు 6న హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో శిక్షణ ఇవ్వనున్నారు.

పోషకాల లోపం నిర్ధారణ

మహిళల్లో విటమిన్ 'డీ' లోపం ఉన్నట్లు ఇటీవల ఓ సర్వేలో తేలింది. జిల్లాలో ఇలాంటి పరిస్థితులున్నట్లు అంచనా వేసిన ఉన్నతాధికారులు.. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమెన్ క్లినిక్‌లకు వచ్చిన వారికి థైరాయిడ్, విటమిన్ డీ3, బీ–12 తోపాటు ఇతర పరీక్షలు చేయనున్నారు. అవసరమైన వారిని ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. లేదంటే వెంటనే మందులు ఇస్తారు. మహిళలందరికీ యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్స్, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ డిసీజెస్ టెస్టులు కూడా నిర్వహించనున్నారు. అంతే కాకుండా హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ మెడికేషన్స్, కౌన్సెలింగ్ కూడా ఉంటాయి. వీటితోపాటు పీసీవోడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్ సమస్యలను కొన్ని పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ తర్వాత అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ టెస్టును రెఫర్ చేస్తారు. బరువుకు సంబంధించిన అంశంలో న్యూట్రిషన్‌ను సూచించడమే కాకుండా యోగా, వ్యాయామాలకు సంబంధించిన వీడియోలు కూడా అందజేస్తారు.

ఎనిమిది ప్యాకేజీల్లో 57 రకాల పరీక్షలు

మహిళలకు ఎనిమిది ప్యాకేజీల్లో 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాథమిక డయాగ్నోస్టిక్స్, క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు వెయిట్ మేనేజ్‌మెంట్, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ ఇన్ఫెక్షన్, పీసీవోడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్, మెనోపాజ్ మేనేజ్‌మెంట్, ఐవీ, యూటీఐ అండ్ పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ డిసీజెస్, తదితర సమస్యలతో వచ్చే మహిళలకు ఈ క్లినిక్‌లలో పరీక్షలు నిర్వహిస్తారు. 24గంటల్లో రిపోర్టులు అందజేస్తారు. ఈ మేరకు తెలంగాణ డయాగ్నోస్టిక్ పోర్టల్‌లో ప్రత్యేక లింక్‌ను రూపొందించారు. శాంపిళ్ల కలెక్షన్, కేంద్రాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు, అదనపు స్టాఫ్‌ను కూడా నియమించనున్నారు.

జిల్లాలో రెండు ఆస్పత్రుల ఎంపిక

మహిళా క్లినిక్‌ల కోసం మొదటి విడతలో జిల్లాలో రెండు ఆస్పత్రులను ఎంపిక చేశారు. ముథోల్ నియోజకవర్గ పరిధిలో భైంసా యూపీహెచ్‌సీ, నిర్మల్ నియోజకవర్గ పరిధిలో బంగల్‌పేట్ యూపీహెచ్‌సీలో ఈ నెల 8వ తేదీన మహిళా క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


బంగల్‌పేట్ యూపీహెచ్‌సీ

క్యాన్సర్‌కు నిమ్స్, ఎంఎన్‌జేలో చికిత్స

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలోనూ క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తారు. 30 ఏళ్లు పైబడిన మహిళలందరికీ మొదట బ్రెస్ట్‌ను పరీక్షిస్తారు. అనుమానితులు, లక్షణాలున్నవారందరినీ జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. అక్కడ మామోగ్రామ్, కోల్పోస్కోపీ, బయాప్సీ, పాప్‌స్మీర్ టెస్టులు చేస్తారు. వీటిలో క్యాన్సర్ నిర్ధారణ అయితే నిమ్స్, ఎంఎన్‌జేలో చికిత్స చేస్తారు. డీఎంహెచ్‌వోలు, సూపరింటెండెంట్లు సదరు బాధితులను ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్న తీరును స్వయంగా పరిశీలించాలి. ఇక మహిళా క్లినిక్‌కు వచ్చిన పేషెంట్ల వివరాలన్నీ ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారు. వీటిని రెఫరల్ ఆస్పత్రులకు లింక్ చేస్తారు. ఆయా ఆస్పత్రుల్లో పేషెంట్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. పేషెంట్ వెయిటింగ్ హాల్‌ను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. రెఫరల్ ఆస్పత్రులుగా మెడికల్ కాలేజీలు, టీవీవీపీ జిల్లా ఆస్పత్రులను వినియోగిస్తారు.

ఇప్పటికే వైద్యసిబ్బందికి శిక్షణ



రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన ఏర్పాటు చేయనున్న మహిళా క్లినిక్‌లకు మన జిల్లాలో రెండింటిని ఎంపిక చేయడం జరిగింది. భైంసా యూపీహెచ్‌సీ, బంగల్‌పేట్ యూపీహెచ్‌సీలో తొలి విడతలో మహిళా క్లినిక్‌లను ప్రారంభించనున్నాం. వీటి పరిధిలో ప్రతీ మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా పరీక్షలు చేసి మందులు అందజేస్తాం. ఇందులో విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి శుక్రవారం హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు.

– ధనరాజ్, డీఎంహెచ్‌వో

అందుబాటులోకి స్పెషల్ యాప్

మహిళా క్లినిక్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఒక యాప్ తయారు చేయించారు. క్లినిక్‌కు వచ్చిన మహిళల వివరాలు, వారి సమస్యలు, చేసిన టెస్టులు, వారికి ఇచ్చే మెడిసిన్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెఫరల్ వివరాలన్నీ ఈ యాప్‌లో ఉంటాయి.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు పరిశీలించిన ట్రైయినీ కలెక్టర్లు


గ్రామస్తులతో ట్రైయినీ కలెక్టర్లు

కడెం(ఖానాపూర్): ఐదురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు ట్రైయినీ కలెక్టర్లు సందీప్ సర్కార్, బంటికుమార్, ఆలీషాఖానం, ప్రీతంసేన్, సౌమ్యబుదిరాజా నచ్చన్‌ఎల్లాపూర్‌లో పర్యటించారు. ఆర్థిక, సామాజిక స్థితిగతులు, అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామస్తులతో 'రచ్చబండ' నిర్వహించారు. నర్సరీ, మిషన్ భగీరథ, తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. కడెం ప్రాజెక్టులో బోటింగ్ చేశారు. వారి వెంట ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో వెంకటేశ్, సర్పంచ్ బొడ్డు గంగన్న, కార్యదర్శి మనోజ్ ఉన్నారు.

మామడ: మండలంలోని కమల్‌కోట్‌ను సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు సందర్శించారు. నర్సరీ, ఉపాధిహామీ పనులు, పంటల వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శిక్షణ అధికారులు అర్క మండల్, విపిన్ సింగ్, సౌనక్య సమద్దర్, మన్వేంద్రసింగ్ రాథోర్, దీపికాయాదవ్, ఎంపీడీవో రమేశ్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ రాధ, ఈజీఎస్ ఏపీవో శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామాన్ని మహిళా ట్రైయినీ అధికారులు సందర్శించారు. శనివారం రాత్రి ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆదివారం గ్రామంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. అధికారులు ముస్కాన్ జైన్, కీర్తి, ఛాయాసింగ్, షికారాయ్, రూపాలిదశరథ్ కర్నె, అంజలి మోరియా, సర్పంచ్ కొడారి గోపాల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రభాకర్, అధ్యక్షురాలిగా సంపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా తిప్ప అరుణ, సలహాదారుగా రవికుమార్, ప్రధాన సలహాదారుగా సాగర్, ఉపాధ్యక్షులుగా వంగ వరలక్ష్మి, సంధ్య, నాగలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా శోభ, అనురాధ, కవిత, కోశాధికారిగా అనసూయ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పద్మ, ప్రచార కార్యదర్శులుగా లక్ష్మి, స్వరూపను ఎన్నుకున్నారు.

'గురుకులం'ను సందర్శించిన ఆర్సీవో


పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్సీవో

లక్ష్మణచాంద(నిర్మల్): సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ అండ్ జేసీ (జి) పాఠశాల, కళాశాలలో ఇంటర్, డిగ్రీలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షలను నిజామాబాద్ ఆర్సీవో మేరి యేసుపాదం పరిశీలించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ విభాగంలో 86 మందికి గానూ 83 మంది, ఎంపీసీ విభాగంలో 369 మందికి గానూ 330 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం


మాట్లాడుతున్న డీడీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీరోజు సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని డెప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీస్టేడియంలో సైక్లింగ్ ఈవెంట్ నిర్వహించారు. సైక్లింగ్ చేయడం వల్ల శరీరంలో అధిక బరువు తగ్గుతుందని, డయాబెటిస్, రక్తపోటు బారిన పడకుండా కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, డీపీఎంవో వినోద్, ఆరోగ్య పర్యవేక్షకురాలు విమల, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిపై అసత్య ప్రచారాలు మానాలి'


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు మానాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారి స్థాయికి మించి మాట్లాడుతున్నారని, మంత్రిపై ఆరోపణలు చేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. మహేశ్వర్‌రెడ్డి ఎన్ని పాదయాత్రలు చేసినా నిర్మల్‌లో గెలిచేది ఐకే రెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, నాయకులు నాలం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్..!


జిల్లా వ్యాప్తంగా వాగులు, నదీ తీర ప్రాంతాల నుంచి కొందరు అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయమై 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా ఆదేశాలు జారీ చేశారు.

- ట్రాక్టర్‌కు రూ.800 డీడీ చెల్లిస్తేనే వేబిల్లు
- ఇకపై అనుమతి లేకుండా తరలిస్తే చర్యలు
- మార్గదర్శకాలు సవరిస్తూ మైనింగ్‌శాఖ ఆదేశాలు జారీ

భైంసాటౌన్(ముథోల్): ఇసుక తవ్వకం, తరలింపులో మార్గదర్శకాలను సవరిస్తూ జిల్లా మైనింగ్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన డీఎల్‌ఎస్‌సీ(జిల్లాస్థాయి ఇసుక కమిటీ) సమావేశంలో ఇసుక రవాణాకు మార్గదర్శకాలు సవరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇకపై జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లోని వాగులు, నదీ తీరప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వ అవసరాలు మినహా ఇతర అవసరాల కోసం తహసీ ల్దార్ పేరిట రూ.800 డీడీ చెల్లించి వేబిల్లు పొందాలని మార్గదర్శకాల్లో సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఇసుకను తరలించుకునేలా వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం ట్రాక్టర్లు, ఎడ్లబండ్లలోనే ఇసుక తరలింపునకు అనుమతించాలని, లారీలకు నిరాకరించాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తూ పట్టుబడితే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి పట్టుబడితే రూ.10వేలు జరిమానా విధించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

వాగులో ఇసుక తోడేళ్లు


అక్రమ రవాణాపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం


తహసీల్దార్లకు మైనింగ్‌శాఖ ఆదేశాలు జారీ చేసిన కాపీ

ఆదేశాలు అందాయి

ఇకపై రెవెన్యూ శాఖ అనుమతితోనే ఇసుక తరలించాలి. ట్రాక్టర్‌కు రూ.800 తహసీల్దార్ పేరిట డీడీ చెల్లించి వేబిల్లు పొందాలి. ప్రభుత్వ అవసరాలు మినహా ఇతరత్రా పనులకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆదేశాలు అందాయి. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, భైంసా

ప్రభుత్వానికి ఆదాయం

ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా వాగుల నుంచి ఇసుక అక్రమంగా తరలించేవారు. అధికారుల అనుమతి లేకుండానే ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో వాగుల నుంచి ఇసుక తరలించుకునేందుకు రూ.లక్షలు చెల్లించి టెండర్లు దక్కించుకునేవారు. స్థానికంగా ఉన్న సహజసిద్ధ వనరులను కొల్లగొడుతూ ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారు. రెవెన్యూ అధికారుల అనుమతితోనే ఇసుక తరలించాలని గతంలోనే ఆదేశాలున్నా సక్రమంగా అమలు కాలేదు. ట్రాక్టర్‌కు(మూడు క్యూబిక్ మీటర్లు) రూ.460 డీడీ చెల్లించి ఇసుక తరలించుకునేలా మార్గదర్శకాలుండగా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది కాదు. ఎట్టకేలకు మరోమారు ఇసుక తరలింపు మార్గదర్శకాలను అమలు చేయాలంటూ కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇసుక కమిటీ సమావేశంలో నిర్ణయించారు. దీంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

ఉత్సాహంగా పోరుయాత్ర

- లక్ష్మణచాంద మండలంలో యాత్ర చేసిన మహేశ్వర్‌రెడ్డి
- పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ


మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పోరుయాత్ర ఉత్సాహంగా సాగింది. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ యాత్రలో పాల్గొన్నారు. అధికసంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు వారికి ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట కోసం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఒక్క సంతకంతో రైతుల రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో స్వరాష్ట్రాన్ని సాధించుకుంటే వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రైతు రుణమాఫీకి రూ.18వేల కోట్లు అవసరంకాగా బడ్జెట్‌లో కేవలం ఆరువేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించడంలేదన్నారు. నిర్మల్ పట్టణ పరిసరాల్లో భూములు కబ్జా చేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రస్తుతం పక్క మండలాల్లోని భూములు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. నిర్మల్‌లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పిన మంత్రి ఇప్పటికీ మంజూరు చేయలేదన్నారు. పట్టణంలోని చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. మళ్లీ అన్ని వర్గాల ప్రజలకు తగిన న్యాయం జరగాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని ఆయన కోరారు. ఎన్నికల్లో తమకు అవకాశం ఇస్తే ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలి

మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారని, 60 ఏళ్ల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్‌కు రాబోయే ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో రిమ్స్ మెడికల్ కళాశాల, నిజామాబాద్‌లో ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టులు నిర్మించింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగన్న, మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, యూత్ అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనమెత్తిన 'అందకూర్'


నెత్తిన బోనాలతో వెళ్తున్న మహిళలు

కుంటాల(ముథోల్): మండలంలోని అందకూర్‌లో శనివారం గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా ముగిసాయి. ఆదివారం మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వచ్చి ముత్యాలమ్మ, మహాలక్ష్మి, బద్దిపోచమ్మ, అరెల్లి మైసమ్మ, అడెల్లి పోచమ్మ, తాతాయి, పోతరాజులకు బోనాలు సమర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, సర్పంచ్ దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్ పాల్గొన్నారు.

బడికి 'కరెంట్' షాక్!

- నిధుల్లో సగం విద్యుత్ బిల్లులకే..
- మిగతా సగంతో నిర్వహణ ఎలా అంటున్న హెచ్‌ఎంలు



మామడ(నిర్మల్): ప్రభుత్వ పాఠశాలలకు కరెంటు బిల్లులు షాక్ ఇస్తున్నాయి. పెరుగుతున్న విద్యుత్ బిల్లులతో పాఠశాల నిర్వహణ నిధుల్లో సగానికి పైగా చెల్లించాల్సి వస్తోంది. మిగతా సగం నిధులు పాఠశాలల నిర్వహణకు సరిపోకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పనులకు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి రావడంతో పాఠశాలల నిర్వహణ భారం తమపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వ, స్థానిక, మోడల్ స్కూళ్లకు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన నిధులు విడుదలయ్యా యి. విద్యార్థుల సంఖ్య 30 లోపు ఉంటే రూ.10 వేలు, 31 నుంచి 100 వరకు ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి వరకు ఉంటే రూ.75 వేలు, వెయ్యికిపైగా ఉంటే రూ.లక్ష చొప్పున నిర్వహణ నిధులు మంజూరు చేస్తోంది.

నిధుల వినియోగం ఇలా..

విద్యార్థుల సంఖ్య ఆధారంగా విడుదల చేసిన నిధుల నుంచి ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నిధుల నుంచి సంవత్సరం విద్యుత్ బిల్లులు, బోధనకు ఉపయోగించే చాక్‌పీస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, నిర్వహణ రిజిస్టర్లు, పరీక్షలకు సంబంధించిన పేపర్లు, పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలు, జాతీయ పండుగల నిర్వహణ వ్యయం, ఇంటర్‌నెట్ చార్జీలు, ప్రొజెక్టర్, కెయాన్ నిర్వహణ, పారిశుద్య పనులు, స్వచ్ఛ ప్రణాళిక అమలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

సగం నిధులు విద్యుత్ బిల్లులకే..

పాఠశాలలకు వచ్చే నిధులను ఏప్రిల్ నుంచి మార్చి మాసం వరకు వినియోగించాల్సి ఉంటుంది. పాఠశాల నిర్వహణ కోసం అందించే నిధులలో సగానికి పైగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకే వినియోగిస్తుండటంతో మిగితా అవసరాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరిపడా నిధులు లేక పోవడంతో విద్యార్థులపై ప్రభావం పడుతోంది.

ఇబ్బందులు ఎదురవుతున్నాయి

మా పాఠశాలకు నిర్వహణకు రూ.50 వేల నిధులు వచ్చాయి. ఇందులో రూ.25 వేలు విద్యుత్ బి ల్లులు చెల్లించాం. మిగి తా రూ.25 వేలతోనే పా ఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. నిధులు సరిపోక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం, జెడ్పీఎస్ఎస్, సిద్దులకుంట

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

పాఠశాలల విద్యుత్ బిల్లులు నిర్వహణ గ్రాంట్ నుంచి చెల్లించాల్సి రావడంతో పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు ఇబ్బంది గా మారింది. పాఠశాలలకు ఉచితంగా వి ద్యుత్ సరఫరా చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ద్వారా ప్రభుత్వానికి విన్నవించాం.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

జిల్లా వివరాలు

ప్రభుత్వ, స్థానిక సంస్థల	
ప్రాథమిక పాఠశాలలు	533
ఉన్నత పాఠశాలలు	117
ప్రాథమికోన్నత	85
మోడల్ స్కూల్	1

పాఠశాలల నిర్వహణకు నిధులు

విద్యార్థుల సంఖ్య	నిధులు(రూ.ల్లో)
1–30	10,000
31–100	25,000
101–250	50,000
251–1000	75,000
1000 కంటే ఎక్కువ	లక్ష

క్లుప్తంగా

మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్‌చైన్‌గేట్: మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మైనార్టీ కమిషన్ సభ్యుడు మహమ్మద్ అత్తర్‌ఉల్లా అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన అతనికి బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల పట్ల సీఎం కేసీఆర్ ఎంతగానో శ్రద్ధ వహిస్తున్నారన్నారు. మైనార్టీల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తౌహిద్‌ఉద్దీన్ రఫ్ఫు, సలీం, నాయకులు మహమ్మద్ రఫీ, సల్మాన్‌ఖాన్, షాదాబ్ అహ్మద్, షేక్ సైయిద్, తదితరులు పాల్గొన్నారు.

రంగయ్యను ఆదర్శంగా తీసుకోవాలి


రంగయ్యను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం

ఆదిలాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్‌కేడ్ మారుమూల గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కె.రంగయ్యను పద్మశాలి సంఘం నాయకులు కొనియాడారు. జిల్లాకేంద్రంలో ఆయన్ను ఆదివారం సన్మానించారు. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బేత రమేశ్ మాట్లాడారు. సమాజంలో సామాజిక రుగ్మతలను, దురాచారాలను అరికడుతూ డిజిటల్ క్లాసులతో సావరేకేడ్ గ్రామాన్ని, పల్లెలోని పాఠశాలలో రంగయ్య మౌలిక వసతులు కల్పించి చిన్నారులకు విద్యనందించారన్నారు. ఉపాధ్యాయులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, సంతోష్, బీసీ వెల్ఫేర్ అధికారి శివకుమార్, పోప నాయకులు స్వామి, లలిత, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


కాలిపోతున్న ఇల్లు

బోథ్: మండల కేంద్రంలోని న్యూకాలనీలో రాథోడ్ సూర్యకళకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేశారు. అంతలోపు ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బీరువాలో ఉన్న నగదు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది. మండలంలో అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ లేదని, ప్రజాప్రతినిధులు కల్పించుకుని బోథ్‌లో ఫైర్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

సరస్వతి కెనాల్‌లో పడి యువకుడి మృతి


సాయి (ఫైల్)

నిర్మల్‌రూరల్: ప్రమాదవశాత్తు సరస్వతి కెనాల్‌లో పడి యువకుడు మృతిచెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. మండలంలోని న్యూపోచంపాడు గ్రామానికి చెందిన రేపని సాయి (20) పని కోసం శనివారం సాయికొట్ల(కే) శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం వద్దకు వెళ్లాడు. సాయంత్రం పక్కనే ఉన్న సరస్వతి కెనాల్ వద్దకు కాలకృత్యాల కోసం వెళ్లి గల్లంతయ్యాడు. ఆదివారం మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదవత్ పూర్ణచందర్‌నాయక్ ఆదివారం పూజలు చేశారు. అనంతరం వేద పండితుడు చక్రపాణి వాసుదేవాచార్యులు ఆయనకు తీర్థప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట నాయకులు మంతెన సత్యం, అన్నారపు అంజి, బక్కశెట్టి శ్రీనివాస్, సందారపు లక్ష్మణ్, ఒడ్డె నవీన్, ఆకుల సుమన్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

క్షణం.. ఆలోచించు !



- విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి
- క్షణికావేశం.. బలవన్మరణాలతో తీరని విషాదం
- తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడిని దూరం చేయాలి
- మానసిక ధైర్యం అవసరమంటున్న నిపుణులు

మంచిర్యాలఅర్బన్/నేరడిగొండ: చదువు విషయంలో ఒత్తిడి, తోటి విద్యార్థులు ఏదో అన్నారని క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతూ కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారు పలువురు విద్యార్థులు. పోటీతత్వం పెరిగిపోవడం.. ఉత్తమ మార్కుల కోసం తల్లిదండ్రుల ఒత్తిడి ఓ వైపు.. కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి మరోవైపు వారి ప్రాణాలపైకి తెస్తోంది. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోవడంతో జీవితంలోనూ ఫెయిల్ అయితానేమో భావన వారిలో ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి షురూ కానున్నాయి. పరీక్షలంటే భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో సానుకూల దృక్పథంతో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చంటున్నారు నిపుణులు.

ప్రణాళికాబద్ధంగా చదివితే..
విద్యార్థులు పాఠ్యాంశాలు అర్థం కాక మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. సమయానికి సిలబస్ మొత్తాన్ని చదువులేక..ఆందోళన చెందుతుంటారు. నిద్రలేమి రాత్రులు..గడపటమే కాకుండా సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం విద్యార్థుల్లో చూస్తుంటాం. ఇలాంటి పరిస్థితుల్లో సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం కష్టమేమి కాదంటున్నారు నిపుణులు. అర్థం కాని పాఠాలను క్షుణ్ణంగా రెండు, మూడు సార్లు చదవాలని సూచిస్తున్నారు. సందేహాలుంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను, తోటి స్నేహితుల సహకారం తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఇతరులతో పోటీ పడడంతోనే విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారు. చదువు విషయంలో ప్రణాళిక, సమయపాలన ముఖ్యం. కష్టమైన సబ్జెక్టు ఉంటే ప్రతిరోజు వారు చదివేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి. కష్టమని పక్కకు పెడితే పరీక్షల సమయానికి ఇబ్బంది తప్పదు. వారి మెదడుకు మేత వేయాలి. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలి. చదువుపై ప్రణాళికబద్ధమైన అలవాటు చేయాలి.

– మహ్మద్ సద్దాం, పీహెచ్‌సీ వైద్యాధికారి, నేరడిగొండ

ఒత్తిడి, మానసిక సమస్యల పరిష్కారంపై అవగాహన



పరీక్ష ఫలితంతో సంబంధం లేకుండా విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భరోసా కల్పించాలి. యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలి. విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలు పరిష్కరించుకునేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టెలీ-మానస్ పేరిట 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్కూల్ మెంటల్ హెల్త్, నేషనల్ టూబాకో కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శిక్షణ నిర్వహించాం. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫిబ్రవరి 28 నుంచి కార్యక్రమం మొదలైంది. అందుబాటులో సైకియాట్రిస్టులు కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు తగిన పరిష్కారాలను సూచిస్తారు.

– డా.సునీల్ కుమార్, మానసిక వైద్యనిపుణులు, మంచిర్యాల

మానసిక ఉల్లాసానికి సమయం



విద్యార్థులు ఏరోజు పాఠశాలను ఆ రోజే చదువుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. తమపై తమకు నమ్మకం పెరగడానికి దోహదపడుతుంది. ఒక్కొక్కరిలో ఒక్కో స్థాయి సామర్థ్యం ఉంటుంది. అంతకుమించి ఆయా కళాశాలల యజమాన్యాలు, తల్లిదండ్రుల ఆశించడంతో ఒత్తిడికి గురవుతుంటారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు టైం టేబుల్ కాకుండా తరగతులు నిర్వహించడం ఒత్తిడికి లోనవుతున్నారు. ఆయా కళాశాలలు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి కూడా తగిన సమయం కేటాయించాలి. యోగా, సాయంత్రం వేళల్లో ఆటవిడుపు చేపట్టాలి. – లక్ష్మణ్‌రావు, అధ్యాపకుడు

మానసిక ధైర్యం చెప్పాలి



తల్లిదండ్రులు పిల్లలకు మానసిక ధైర్యం చెప్పకపోతే భవిష్యత్‌లో ఎదురయ్యే కఠిన పరీక్షలను ఎదుర్కోలేరు. విద్యార్థులు పరీక్షలంటే భయం పడాల్సిన అవసరం లేదు. మార్కులు జీవితానికి ప్రమాణికంగా కాకుండా వారిని ప్రోత్సహించే విధానాలు తెలుసుకుని మానసికంగా బలవంతుల్ని చేయాలి. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కరోనా తర్వాత పరీక్షలను సులభతరం చేసింది. ఒత్తిళ్లను దూరం చేసేలా చర్యలు చేపట్టింది. పదకొండు పేపర్లకు బదులుగా ఆరు పేపర్లుగా మార్చుతూ నిర్ణయం తీసుకుంది. పాఠ్యాంశాలు అర్థం చేసుకోని చదువుకోవాలి.

– ఎస్.వెంకటేశ్వర్లు డీఈవో

భయం వీడితే జయం



విద్యార్థులకు పరీక్షల సమయంలో సరైన నిద్ర అవసరం. రాత్రంతా పుస్తకాలతో కుస్తీ పట్టడంతో ప్రయోజనం తక్కువే. కనీసం ఆరు గంటల నిద్ర అవసరం. నిద్రపోకుండా చదవటం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఆరోగ్యం క్షీణిస్తోంది. పోషక విలువలు కల్గిన ఆహారంతో పాటు నీటిని ఎక్కువగా తాగాలి. ప్రతి సబ్జెక్టు క్షుణ్ణంగా చదవాలి. అవగాహనతో అర్థం చేసుకుంటూ చదవాలి. ఆత్మవిశ్వాసం, సమయపాలనతో పాటు ప్రణాళికబద్ధంగా చదవటం అలవర్చుకుంటే లక్ష్యాన్ని చేరుకోవటం సులువే.

– అంబాల సమ్మయ్య, కౌన్సెలింగ్, సైకాలజిస్టు

బాసరలో భక్తుల రద్దీ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఫాల్గుణ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించిన భక్తులు అమ్మవారి సన్నిధిలో తమ పిల్లలకు అక్షర శ్రీకార పూజలు చేయించారు.

నకిలీ జిందా తెలిస్మాత్ అమ్మితే చర్యలు

ఖానాపూర్: పట్టణంలోని మెడికల్, కిరాణా దుకాణాల్లో ఎవరైన నకిలీ జిందా తెలిస్మాత్ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ తెలిపారు. హైదరాబాద్ నుంచి జిందా తెలిస్మాత్ కంపెనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని పలు దుకాణాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించామన్నారు. 59 నకిలీ జిందా తెలిస్మాత్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు. వినియోగదారులు నకిలీ, ఒరిజినల్ జిందా తెలిస్మాత్‌ను గుర్తించి కొనుగోలు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని బారేమోడి గ్రామానికి చెందిన యువకుడు మొహర్లే రాందాస్(22) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బారేమోడికు చెందిన మొహర్లే శంకర్, కమలాబాయిలకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నవాడైన రాందాస్ కెరమెరి నుంచి బారేమోడికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్టార్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా 'గురుకుల' యూజీ సెట్


పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, ఎస్సై రాజశేఖర్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని డిగ్రీ కళాశాలల్లో ఆదివారం అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (యూజీ సెట్–2023) ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. మొత్తం 2,207 మందికి గాను 2,023 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మరో 184 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల హాజరు 91.66 శాతంగా నమోదైనట్లు గురుకులాల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ప్రకటించారు.

పరీక్ష కేంద్రాల వారీగా..

ఆదిలాబాద్ (సీవోఈ బాలికల గురుకుల కళాశాల) పరీక్ష కేంద్రంలో 490 మంది విద్యార్థులకుగాను 450 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. ఇచ్చోడ (బాలికల డిగ్రీ కళాశాల) పరీక్ష కేంద్రంలో 337 మందికి 303 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. మరో 34 మంది హాజరుకాలేదు. సిర్పూర్ (టి)(బాలికల గురుకుల కళాశాల) లో 333 మందికి 304 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 29 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. సిర్పూర్ (టి) (బాలుర గురుకుల కళాశాల)లో 347 మంది విద్యార్థులకు 315 మంది పరీక్ష రాశారు. మరో 32 మంది గైర్హాజరయ్యారు. బెల్లంపల్లి (సీవోఈ బాలుర గురుకుల కళాశాల)లో 219 మందికి 209 మంది పరీక్షకు హాజరయ్యారు.10 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. బెల్లంపల్లి (సంక్షేమ బాలికల గురుకుల కళాశాల)లో 481 మంది విద్యార్థులకు గాను 442 మంది పరీక్ష రాశారు. మిగిలిన 39 మంది విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు దూరంగా ఉండి పోయారు. యూజీ సెట్ పరీక్ష నిర్వహణను ఆర్‌సీవో స్వరూపరాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంచిర్యాలలో రక్షా హోమ్ బుకింగ్స్ ప్రారంభం


రక్షా హోమ్ అపార్ట్‌మెంట్


ప్రారంభోత్సవంలో పాల్గొన్న కైలాస్ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలో అన్నిహంగులతో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ రక్షా హోమ్స్‌ను ఆదివారం రక్షా కన్‌స్ట్రక్షన్స్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కైలాస్ శ్రీనివాస్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించి బుకింగ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో మొదటిసారిగా మంచిర్యాలలోని ఏసీసీలో రక్షా హోమ్స్‌ను నిర్మించామని తెలిపారు. 60 బ్లాక్‌లు నిర్మించగా, స్విమ్మింగ్‌పూల్, లేడీస్ జెంట్స్ క్లబ్, చిల్డ్రన్స్ పార్కు, ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేశామన్నారు. విశాలమైన వెయిటింగ్ హాల్, పార్కింగ్ స్థలాలు ఈ అపార్టుమెంట్‌కు ఉన్నాయన్నారు.

ప్రాణం తీసిన మూలమలుపు

- బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

జైనథ్: మండలంలోని బెల్గాం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న మూలమలుపు మృత్యుకూపంగా మారింది. గ్రామ సమీపంలోని వాగుపై నిర్మించిన బ్రిడ్జి మూలమలుపు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ నిండు ప్రాణం బలిగొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మాకోడ గ్రామానికి చెందిన నిపుంగే కృష్ణ(21) తన మిత్రుడు సునీల్‌తో కలిసి బైక్‌పై బేల వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా బెల్గాం మూల మలుపు వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా బైక్ అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డ్‌కు వెళ్లి ఢీకొనడంతో కృష్ణ తలకు గాయాలయ్యాయి. సునీల్ రోడ్డు కింద పడిపోయాడు.

సీపీఆర్ చేసినా నిలవని ప్రాణం

ప్రమాదంలో కింద పడిపోయిన సునీల్ వెంటనే తేరుకుని ఆపస్మారక స్థితిలో ఉన్న కృష్ణ వద్దకు వెళ్లి వెంటనే సీపీఆర్ చేశాడు. గుండె వద్ద పంప్ చేస్తూ, స్పృహలోకి తెప్పించేందుకు ప్రయత్నించాడు. అప్పటికే స్థానికులు అక్కడికి చేరుకోవడంతో 108కి సమాచారం అందించారు. ఇద్దరిని 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. కృష్ణకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యన మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు నిపుంగే విజయ్, సువర్ణలు బోరున విలపించారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో గొప్ప స్థానానికి వెళ్తాడనుకుంటే, కానరాని కోకాలకు వెళ్లిపోయాడని కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నిపుంగే కృష్ణకు సీపీఆర్ చేస్తున్న క్షతగాత్రుడు సునీల్

అడెల్లి ఆలయంలో భక్తుల సందడి

సారంగపూర్: శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెలించుకున్నారు. వీరి కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. సారంగపూర్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని అదనపు కలెక్టర్ రాంబాబు దంపతులు, బీఆర్‌ఎస్ నాయకుడు కూచాడి శ్రీహరిరావు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయన్ను ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.


అదనపు కలెక్టర్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు


మొక్కులు చెల్లించుకున్న ఉప సర్పంచులు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలోని మహా పోచమ్మ వద్ద మండల ఉప సర్పంచులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మోహన్, ప్రధాన కార్యదర్శి అశోక్, క్యాషియర్ శ్రీనివాస్, సభ్యులు విద్యాసాగర్‌రెడ్డి, ముత్యం, సురేశ్, ముత్తన్న, ధర్మన్న, రాజన్న, శ్రావణ్, లింగన్న, వెంకటేశ్, అశోక్, రమణ, లక్ష్మణ్, రహమాన్ ఉన్నారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్

పరీక్ష కేంద్రాల వారీగా..

పరీక్ష కేంద్రం	అలాట్‌మెంట్‌విద్యార్థులు	హాజరు	గైర్హాజరు
ఆదిలాబాద్ (బాలికలు)	648	614	34
బోథ్ బాలికలు	648	612	36
ఇచ్చోడ (బాలురు)	312	295	17
ఇచ్చోడ డిగ్రీ కళాశాల	312	295	17
ఆసిఫాబాద్ (బాలురు)	528	487	41
సిర్పూర్(టి) (బాలురు)	511	483	28
సిర్పూట్(టి) (బాలికలు)	528	501	27
రెబ్బెన (బాలికలు)	159	148	11
బెల్లంపల్లి (సీవోఈ)	504	476	28
బెల్లంపల్లి (బాలికలు)	493	473	20
కాసిపేట (బాలురు)	379	356	23
లక్సెటిపేట (బాలికలు)	545	522	23
చెన్నూర్ (బాలికలు)	576	554	22
జైపూర్ (బాలురు)	576	549	27


కాసిపేట బాలుర పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో స్వరూపరాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన సీవోఈ సెట్–2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 6,365 మంది హాజరై పరీక్ష రాశారు. మరో 354 మంది డుమ్మా కొట్టారు. మొత్తంగా విద్యార్థుల హాజరు 94.74 శాతంగా నమోదైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ప్రకటించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1 గంటతో ముగిసింది. ఉదయం 9 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి వచ్చారు. ఆయా కేంద్రాల ముఖద్వారం వద్ద వారిని పరిశీలించిన తర్వాత లోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఆర్‌సీవో

బెల్లంపల్లిలోని కాసిపేట బాలుర గురుకుల కళాశాల, ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని రెబ్బెన పరీక్ష కేందాలను ఆర్‌సీఓ స్వరూపరాణి పర్యవేక్షించారు. పరీక్షల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఎప్పటికప్పుడు ఆమె పర్యవేక్షించి చీఫ్ సూపరింటెండెంట్లకు మార్గదర్శకం చేశారు. బెల్లంపల్లి సీవోఈ కళాశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, బాలికల గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, ఊటూరి సంతోష్, స్వరూపలు పటిష్ట చర్యలు తీసుకున్నారు. డిపార్ట్ మెంటల్ అధికారులుగా పూర్ణిమ, స్వప్న వ్యవహరించగా, రూట్ అధికారిగా కోటిచింతల మహేశ్వరరావు ఆనందరెడ్డి పనిచేశారు.

సారంగపూర్: జామ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో సీవోఈ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఇందులో 435 మంది హాజరు కాగా మరో 25 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు.